శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## ప్రకృతి విలయంతో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు



**నెల్లూరు అగ్రికల్చర్, మే 31, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ మండలం కొమ్మరపూడి బ్రాంచ్ రోడ్డులో ఉన్న స్పందన వెల్నెస్ సెంటర్‌లో ఆదివారం వీచిన బలమైన గాలులకు అనేక చెట్లు నేల కూలాయి. ఆదివారం 4:00 గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. కొమ్మరపూడి గ్రామంలో ఉన్నప్పళగా ఉరుములు మెరుపులతో బలమైన ఈదురు గాలులు వచ్చాయి వీచాయి. స్పందన వెల్నెస్ సెంటర్లో ఓ విద్యుత్ స్తంభం నేలకొరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అదే సమయంలో ఆ ప్రాంతంలో ములుమూడి వరి పొలాల్లోనూ 2 విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. అదే సమయంలో ఓ చిన్నపాటి వర్షం కురవడంతో వాతావరణం కూల్‌గా మారిపోయింది. దీంతో కొమ్మరపూడి ములుమూడి ప్రాంతాల్లో ఎండ వేడిమి తర్వాత వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో సాయంత్రం వేళ ప్రజలు చల్లని గాలులను ఆస్వాదించారు

## జొన్నవాడ కామాక్షితాయికి 50 వేలు బహుకరణ



**బుచ్చి మే 31 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడ లోని శ్రీమల్లికార్జున స్వామి, కామాక్షి తాయికి నెల్లూరుకి చెందిన నీలి హితీష్ కుటుంబ సభ్యులతో కలిసి 50 వేల రూపాయాలు అందజేశారు. ఈ నగదు చెక్కును ఆలయ చైర్మన్ తిరుమూరు అశో క్‌రెడ్డి సమక్షంలో ఆలయ ఇఒ ఆర్వభూమి శ్రీనివాసులురెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వారికి ప్రసాదాలు అందజేశారు. స్వామి అమ్మవార్ల దర్శనం కల్పించారు.

## పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించి అన్ని విధాలా ఆదుకుంటాం

- రైతుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తాం
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- నెల్లూరులో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేసిన పొగాకు రైతులు
- రైతుల సమక్షంలో మంత్రులు గొట్టిపాటి రవి, అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి ఆనం
- త్వరలో రైతు ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం




**నెల్లూరు వైద్యం, మే 31, ప్రభాతవార్త :** పొగాకు రైతుల సమస్యలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా పరిగణిస్తోందని, వారికి గిట్టుబాటు ధర కల్పించి అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఆదివారం ఉదయం నెల్లూరు నగరంలోని సంతపేటలో గల తన క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని పలువురు పొగాకు రైతులు, రైతు ప్రతినిధులు మంత్రిని కలిసి తమ సమస్యలను వివరించారు. పొగాకు కొనుగోళ్లు మందగించడం, వేలం ధరలు గణనీయంగా తగ్గిపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని, పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలోని డీసీపల్లి, ఉదయగిరి నియోజకవర్గంలోని కలిగిరి టొబాకో బోర్డు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఉదయగిరి, కావలి, ఆత్మకూరు ప్రాంతాల్లో వేలాది మంది రైతులు పొగాకు సాగుపై ఆధారపడి జీవిస్తున్నారని, ఈ ఏడాది వాతావరణం అనుకూలించి మంచి నాణ్యత గల పంట వచ్చినప్పటికీ ధరలు పడిపోవడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందన్నారు. నెల్లూరు జిల్లాలో సుమారు 45 వేల ఎకరాల్లో పొగాకు సాగు జరుగుతుండగా, దాదాపు 4 వేల మంది రైతులు ఈ పంటపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. గత ఏడాది కిలో పొగాకు ధర రూ.280 నుంచి రూ.360 వరకు పలికిందని, ప్రస్తుతం డీసీపల్లి, కలిగిరి కేంద్రాల్లో ధరలు రూ.190 వరకు పడిపోవడం రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోందన్నారు. పొగాకు కొనుగోళ్ల విషయంలో రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతో మాట్లాడినట్లు మంత్రి తెలిపారు. గిడ్డంగుల కొరత వంటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, మంత్రి దోలా బాల వీరాంజనేయస్వామి తదితరులు ఇప్పటికే ఈ అంశాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. రాష్ట్రంలోని పొగాకు రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి కేంద్ర వాణిజ్య శాఖ, ఆర్థిక శాఖ మంత్రులకు లేఖ రాసినట్లు వెల్లడించారు. త్వరలోనే పొగాకు రైతు ప్రతినిధులు, టొబాకో బోర్డు అధికారులు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి సమస్యలపై సమగ్రంగా చర్చించనున్నట్లు తెలిపారు. ఆ సమావేశానికి నెల్లూరు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, రైతు ప్రతినిధులను కూడా ఆహ్వానిస్తామని చెప్పారు. పొగాకు రైతులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వం వారి పక్షాన నిలుస్తుందని, ప్రతి రైతును ఆదుకుంటామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హామీ ఇచ్చారు.

## కళ్యాణం ...... కమనీయం....

### శ్రీమల్లికార్జునస్వామి వారి కల్యాణ వైభగోం







**బుచ్చి మే 31 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో 16 రోజుల పండుగ సందర్భంగా స్వామి అమ్మవార్లకు కన్నుల పండుగగా కళ్యాణం నిర్వహించారు. ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి దంపతులు పీఠలపైన కూర్చోగా స్వామి అమ్మవార్ల కళ్యాణం వేదమంత్రోచ్చరణ నడుమ వేడుకగా నిర్వహించారు. ఆలయ ఇఒ ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఆలయ ఇఒ ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతు బ్రహ్మోత్సవాలు అయిపోయిన తరువాత 15 రోజులకు ఈ కళ్యాణం నిర్వహించడం ఆనవాయితీ అని చెప్పారు. ఈ సంవత్సరం దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో మూడు పుణ్యక్షేత్రాలైన శ్రీకాళహస్తి, శ్రీశైలం, విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద నుండి సారీ తీసుకొని రావడం జరిగిందని ఇది ఎంతో శుభ పరిణామమని వారు పేర్కున్నారు. వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. చల్లని వాతావరణంలో పౌర్ణమి గడియలలో స్వామి అమ్మవార్ల కళ్యాణం తిలకించి భక్తులు పరవశించారని వారు తెలిపారు. ట్రస్టు బోర్డు మెంబర్లు జొన్నలగడ్డ వరలక్ష్మీ, కీలుకుప్ప శ్రీనివాసులు, సూరాయపాళెం ప్రత్యూషా, కొల్లపూడి శారద, రామాయణం సుధారాణి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## సొంత భవనం లేక ఇబ్బందులు పడుతున్న ఎక్సైజ్ శాఖ

### - అద్దె భవనాల్లోనే కార్యకలాపాలు







**కోవూరు, మే 31, ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గానికి మండల కేంద్రం అయిన కోవూరులో గత 30 సంవత్సరాలకు పైగా ఎక్సైజ్ శాఖకు ఇప్పటికీ సొంత భవనం లేకపోవడంతో సంబంధిత శాఖ అధికారులు అద్దె భవనాల్లోనే కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే కోవూరులోని ఎక్సైజ్ శాఖ కార్యాలయం రెండు మూడు చోట్ల అద్దె భవనాలు మారుస్తూ ప్రస్తుతం కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. అద్దె భవనాల్లో ముద్దాయిలను పూర్తిగా విచారించేందుకు తగిన సౌకర్యాలు లేకపోవడం, సీజ్ చేసిన వాహనాలను ఏర్పాటు చేసేందుకు కూడా సరైన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. పాతిక సంవత్సరాల క్రితం కోవూరు ఎక్సైజ్ శాఖకు తాలూకా కార్యాలయ ప్రాంణంలో 10 సెంట్ల స్థలాన్ని అప్పట్లోనే రెవెన్యూ అధికారులు కేటాయించారు. ప్రభుత్వాలు మారుతున్నా ఈ ప్రాంతంలో మాత్రం ఎక్సైజ్ శాఖ నూతన భవనం నిర్మించిన దాఖలాలు లేవు. ఒక వైపు ప్రభుత్వానికి ఈ శాఖ ద్వారా కోట్లాది రూపాయలు ఆదాయం వస్తున్నా మారిపోతున్న ప్రభుత్వాలకు మాత్రం కోవూరు ఎక్సజ్ శాఖకు భవనం నిర్మించాలని లేకపోవడం గమనార్హం. గత మూడు దశాబ్దాలకు పైగా స్థలం ఉన్నా కేవలం ఆ ప్రాంతంలో ఈ స్థలం తమదని బోర్డు ఏర్పాటు చేశారే తప్ప భవనం నిర్మించాలనే ఆలోచన సంబంధిత శాఖ అధికారుల్లో గానీ, ప్రజాప్రతినిధుల్లో గానీ లేకపోవడం గమనార్హం.

## పొగాకు రహిత సమాజాన్ని నిర్మించాలి

### - నెల్లూరు రైల్వే డీఎస్పీ జి.మురళీధర్




**నెల్లూరు క్రైమ్, మే 31, ప్రభాతవార్త:** పొగాకు వాడకం వల్ల కలిగే ప్రాణాంతక వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, యువతను వ్యసనాలకు దూరం చేసి పొగాకు రహిత సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత అందరిపై ఉందని నెల్లూరు రైల్వే పోలీస్ స్టేషన్ డీఎస్పీ జి.మురళీధర్ పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆదివారం రైల్వే ఫీడర్స్ రోడ్డులోని రైల్వే డీఎస్పీ కార్యాలయంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. ది పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా, నారాయణ డెంటల్ కాలేజీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పొగాకు విముక్తి ఆందోళన అనే కరపత్రికను రైల్వే డీఎస్పీ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నివారించదగిన మరణాలకు పొగాకు వాడకమే ప్రధాన కారణమని, సిగరెట్లు, ఈ సిగరెట్లు, నికోటిన్ ఉత్పత్తులు యువతను, చిన్న పిల్లలను వ్యసనపరులుగా మారుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పొగాకు పొగ వల్ల లక్షలాది మంది దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె జబ్బులు, పక్షవాతం, ముఖ్యంగా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారని, కేవలం సిగరెట్లు మాత్రమే కాకుండా నమలడం ద్వారా వాడే గుట్కా, పాన్ పరాగ్, ఖైనీ, హుక్కాల వల్ల కూడా తీవ్ర అనారోగ్య ప్రమాదాలు పొంచి ఉన్నాయని హెచ్చరించారు. ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణ కుమార్ మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న పొగాకు అలవాటుతో యువతరం నిర్వీర్యమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న వయసులో సరదాగా మొదలయ్యే ఈ అలవాట్లు క్రమంగా వ్యసనంగా మారి భవితను దహించి వేస్తున్నాయన్నారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, సినిమా థియేటర్లు, డిజిటల్ వేదికలపై పొగాకు ఉత్పత్తుల ప్రకటనలను కచ్చితంగా నిషేధించాలని కోరారు. 18 ఏళ్లలోపు పిల్లలకు పొగాకు అమ్మకూడదని, 2019 నాటి ఈసిగరెట్ యాక్ట్‌ను పూర్తిస్థాయిలో అమలు చేస్తూ ఆన్‌లైన్ విక్రయాలను కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ థీమ్ ఆకర్షణ, ముసుగు తొలగింపు పొగాకు, నికోటిన్ వ్యసనాన్ని తిప్పికొట్టడం, ధూమపానం వల్ల కలిగే నష్టాలపై యువతకు అవగాహన కల్పించడంలో గ్రామీణ వైద్యులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. అనంతరం రైల్వే స్టేషన్ వెలుపల ఉన్న ఆటో డ్రైవర్లకు, ప్రజలకు పొగాకు వ్యతిరేక కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.శరన్, జిల్లా పీ.హెచ్.పీ గౌరవాధ్యక్షుడు అనుముల జయప్రకాష్, శాఖవరపు వేణుగోపాల్, దేవరకొండ శ్రీనివాసులు, నరసాపురం ప్రసాద్, ఉప్పలపాటి రామదాసు, నంద్యాల మాలిని, షేక్ సల్మా, ఎన్.చెంగయ్య, అబ్దుల్ ఖాదర్, ఖాదర్ భాష తదితరులు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో రైతులపై అరాచకం - కాకాణి



**పొదలకూరు, మే 31, ప్రభాతవార్త** కూటమి పాలనలో రైతులపై అరాచకం చేస్తున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పొదలకూరు మండలంలోని నావూరు గ్రామంలోని రైతులు నరసింహులు, వెంకటేశ్వర్లుకు చెందిన సుమారు 80 ఎకరాల జామాయిల్ తోట అగ్నికి ఆహుతి కావడంతో, దగ్ధమైన జామాయిల్ తోటను పరిశీలించి, బాధితులను పరామర్శించి, అన్ని విధాల అండగా ఉంటానని మాజీ మంత్రి వర్యులు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా కాకాణి గోవర్ధన్ రెడ్డి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జామాయిల్ తోటలో అగ్నిప్రమాదం వెనుక విద్రోహ చర్య ఉన్నట్లు అనుమానం ఉందన్నారు. కాలిపోయిన జామాయిల్ తోటను చూస్తుంటే కడుపు మండిపోతుందని ఆవేదన వ్యక్తం చేసారు. గతంలో ఎన్నడూ సర్వేపల్లి నియోజకవర్గంలో ఇలాంటి దుర్ఘటనలు, దుశ్చర్యలు, జరగలేదని, కూటమి పాలనలోనే చూస్తున్నామన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని శిక్షించాలని ఆయన కోరారు. రైతుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తే, రేపు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ప్రజలు, రైతులు జగన్ మోహన్ రెడ్డి పాలనలోనే సుభిక్షంగా ఉన్నారన్నారు. ఆయనతో పాటు మండల వైకాపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఒక్కపని చేయకుండా ఇరిగేషన్ పనుల్లో 150 కోట్లు తినేశావ్

### - కాకాణి పై సోమిరెడ్డి ధ్వజం



**పొదలకూరు, మే 31, ప్రభాతవార్త** ఒక్క పని చేయకుండా ఇరిగేషన్ పనుల్లో 150 కోట్లు కాకాణి తినేశాడని ఎమ్మెల్యే సోమిరెడ్డి ధ్వజమెత్తారు. పొదలకూరు మండలంలోని అంకుపల్లి గ్రామంలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వరద సమయంలో యుద్ధ ప్రాతిపదికన తవ్విన కాలువలు ప్రస్తుతం చేపడుతున్న కాలువ పనులను గ్రామ నాయకులతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కండలేరు స్పిల్ వే నుంచి వావింటపర్తి వరకు వరద కాలువలో రూ.50 లక్షలతో అద్భుతంగా పనులు జరుగుతున్నాయన్నారు. పనులు జరుగుతున్న విధానాన్ని మీడియాకు ప్రత్యక్షంగా చూపించామన్నారు. ప్రతి పనిని జరగక ముందు, జరిగిన తర్వాత జీపీఎస్ ఫొటోలతో రికార్డు చేసి పెడుతున్నామన్నారు. తోడేరు రెడ్డికి కంటి ఆపరేషన్ చేయించాలేమో అర్థం కావడం లేదన్నారు. పారదర్శకంగా పనులు జరుగుతున్నా అవినీతి, అక్రమాలు అంటే అబద్ధాల పాట పాడుతున్నాడన్నారు. అంకుపల్లికి వస్తుండగా మార్గమధ్యలో అనేక పనులు చూశాను. ప్రతి పనిని చాలా చక్కగా చేస్తున్నారని, అందరికీ కనిపించే చోట ఒకలా, లోపల మరోలా పనులు జరగడం లేదని, ఎక్కడ చూసినా పనులను ఒకేలా, పారదర్శకంగా జరిగేలా చూస్తున్నామన్నారు. నేను మొదటి నుంచి ఇరిగేషన్ అధికారులకు, నీటి సంఘాల ప్రతినిధులకు ఒకే మాట చెబుతున్నామని, పనులు జరగకుండా ఒక్క బిల్లు చేసినా ఒప్పుకోనని స్పష్టం చేస్తున్నామని, చిన్న పొరపాటు చేసినా అధికారులపై తానే ఫిర్యాదు చేసి సస్పెన్షన్ చేయిస్తానని హెచ్చరిస్తున్నా నిత్యం నోటికొచ్చినట్టు మాట్లాడటం కాదు.. రైతులకు జరుగుతున్న మంచిని స్వాగతించాలన్నారు. మొంథా తుఫాన్ సమయంలో జిల్లాలో ఎఫ్.డీ.ఆర్ నిధులు 93 కోట్లను కలెక్టర్ మంజూరు చేశారన్నారు. ఉత్తర్వుల కాపీ బయటకు వచ్చిందో లేదో..మరుక్షణమే సోమిరెడ్డి రూ.100 కోట్లు తినేశారంటూ కాకాణి పాట అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు, పిఎసిఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్ బాబు, పట్టణాధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున నాయుడు, గ్రామ నాయకులు పులిపాటి వెంకట రత్నం నాయుడు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## అవినీతిపై సోమిరెడ్డితో బహిరంగ చర్చకు సిద్ధం

### - సవాల్ విసిరిన కాకాణి



**పొదలకూరు, మే 31, ప్రభాతవార్త** అవినీతిపై సోమిరెడ్డితో బహిరంగ చర్చకు సిద్ధమని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సవాల్ విసిరారు. ఆదివారం పొదలకూరు మండలం నావూరు చెరువు కట్టను పరిశీలించి, నాసిరకంగా జరుగుతున్న ఇరిగేషన్ శాఖ పనులపై మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు. నావూరు గ్రామానికి విచ్చేసిన కాకాణికి ఇరిగేషన్ పేరిట, సోమిరెడ్డి దోపిడీని కళ్ళకు కట్టినట్లు స్థానిక రైతులువివరించారు. ఇరిగేషన్ పనులు అత్యంత నాసిరకంగా చేపడుతూ, కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారంటూ కాకాణి ఎదుట రైతుల ఆవేదన వ్యక్తం చేసారు. రహదారుల మరమ్మత్తుల పేరిట సుద్దమట్టిని తోలి, తమకు తీరని ద్రోహం చేస్తున్నారంటూ స్థానికులు మండిపడ్డారని కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. కొండనాలుకకు మందు వేస్తే, ఉన్న నాలుక ఊడిన చందంగా, ఉన్న గ్రావెల్ రోడ్డుపై శుద్ధ మట్టి పోసి, తామంతా జారిపడే విధంగా, నాసి రకంగా రోడ్డు నిర్మిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేసారు. పొలాలకు వెళ్లే దారులకు మరమ్మత్తులు చేపడతామని, పొలాల్లోకి వెళ్లడానికి అవకాశం లేకుండా చేస్తున్నారంటూ రైతులు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహణ

### - మీ కోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం
### - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

**నెల్లూరు కలెక్టరేట్, మే 31, ప్రభాతవార్త** ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నందు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ మీకోసం.ఏపి.జివోవి.ఇన్ ద్వారా నమోదు చేసుకోవచ్చును. అర్జీ స్థితి లేదా ఇతర వివరాలకు సంబంధించి సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చును. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా, మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ తదితర ఏర్పాట్లు చేయడమైనది. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.



## అభిమానులకు అండగా ఉంటా : చేజర్ల



**ఉదయగిరి, మే31, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలో నా అభిమానులు ఎక్కడున్నా వారికి అండగా నిలుస్తానని చేజర్ల సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం ఉదయగిరి గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఉప్పుటూరి హరి చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో వెన్నుముక శస్త్ర చికిత్స చేయించుకుని ఉదయగిరికి వచ్చిన సందర్భంలో వైఎస్సార్‌సీపీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉదయగిరి మాజీ మండల పరిషత్ అధ్యక్షులు చేజర్ల సుబ్బారెడ్డి ఉప్పుటూరి హరి ఇంటికి వెళ్లి పరామర్శించి నీ వెన్నంటే ఉంటానని, నీకేం భయం లేదని ధైర్యం చెప్పారు. చేజర్ల సుబ్బారెడ్డి గత పది సంవత్సరాల నుండి చేజర్ల ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి కులమతాలతో సంబంధం లేకుండా వివాహ సందర్భంలో ఆర్థిక సహాయం చేస్తున్నారు. ఎవరికైనా ఆరోగ్యం భాగా లేకపోయినా కూడా వారి ట్రస్టు తరుపున సహాయం చేస్తున్నారు. ఉదయగిరి రాజకీయాలలో ముందుండి చేజర్ల అనుచరుడిగా ఉన్న వారికి ఆరోగ్యం భాగా లేకపోతే అతనికి ఖర్చైనా మొత్తం నానలుగు లక్షల రూపాయలను చేజర్ల సుబ్బారెడ్డి సహాయం చేసి ఆదుకున్నారు. చేజర్ల సుబ్బారెడ్డి చేసిన సహాయాన్ని ఎప్పటికి మరువలేనని ఆయనకు ఎప్పటికి విధేయుడిగా ఉంటానని ఈ సందర్భంగా ఉప్పుటూరి హరి చెప్పారు. వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ దస్తగిరి అహ్మద్, దాసరి పల్లి మాజీ సర్పంచ్ సయ్యద్ గౌస్ మొహిద్దీన్, వైఎస్సార్ సీపీ ఉదయగిరి మండలం మాజీ కన్వీనర్ సీఎం ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెన్నర్ల అసోసియేషన్ కన్వీనర్ కే.నారాయణరెడ్డి, మైనార్టీ నాయకులు షేక్ జాఫర్ అహ్మద్, ఎంఏ రియాజ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యూత్ వింగ్ కన్వీనర్ షావుకారి ఎంఏ సలీం, వైఎస్సార్‌సీపీ బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి మట్ల హరి, బీసీ నాయకులు ఉప్పుటూరి రమణ, యువ నాయకులు షావుకారు షారుక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎవరడుగుతారు.. ఎందుకుడుగుతారు..! సమయపాలన పాటించని

## సచివాలయ సిబ్బంది ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రజలు అసంతృప్తి

**కోట, మే 31 ప్రభాతవార్త :** కోట మండలంలోని పలు సచివాలయాల్లోని ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. అందుబాటులో ఉండటం లేదని ఆయా గ్రామాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామ స్థాయిలోనే పౌరులకు అన్ని రకాల సేవలందించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ పనితీరు నానాటికి తీసి కట్టుగా మారింది. సేవలు అటుంచితే అసలు ఉద్యోగులు విధులుకు హాజరుకావడమే గగనంగా మారింది. ఎక్కడా సమయపాలన పాటించడం లేదు. వారి వ్యవహార శైలితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సచివాలయాల ఉద్యోగుల పనితీరు పై ప్రభుత్వం ఇటివల ప్రజాభిప్రాయ సేకరణకు శ్రీకారం చుట్టింది. కార్యాలయ పని వేళల్లో ఉద్యోగులు అందుబాటులో




ఉంటున్నారా ? మర్యాదగా నడుచుకుంటున్నారా ? పని చేయడానికి నగదు డిమాండ్ చేస్తున్నారా ? తదితరాలను గ్రాయ సచివాలయ శాఖ ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయాల సేకరిచింది. చాలా చోట్ల సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. ఎప్పుడోస్తారని ఎవరైనాఫోన్ చేస్తే ..సర్వే పనిలో ఉన్నామని సమాధానిమిస్తున్నారు. ఒక వేళ బయటకెళ్తే మూమెంట్ రిజిస్టర్‌లో సంతకం పెట్టాల్సి ఉండగా .. ఆ నిబంధన ఎక్కాడ పాటించడ లేదు. ఇటివల కోట సచిలయాలం 3 కార్యాలయా సిబ్బంది ఉదయం 11 గంటలైనా కార్యాలయాలం కు రాలేదు. బయటే తాళాలు కోరకు మరో ఉద్యోగి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పటికి ప్రజలు సచివాలయకు వచ్చి తాళాలు వేసి ఉండటం చూసి వెనుతిరిగి వేళ్లారు. అధికారులు సచివాలయాల ఉద్యోగుల పనితీరుపై పర్యేవేక్షణ కొరవడిందని విమర్శలు వినవస్తున్నాయి.

## చేజర్ల పోలీసు స్టేషన్‌కు శాశ్వత ఎస్సైని నియమించాలి

– జిల్లా ఎస్పీకి బీజేపీ నేతల వినతిపత్రం

**చేజర్ల, మే31, ప్రభాతవార్త :** చేజర్ల మండల పోలీసు స్టేషన్‌కు గత రెండు నెలలుగా రెగ్యులర్ సబ్ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీకి బీజేపీ చేజర్ల మండల కమిటీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో వారు పేర్కొన్న వివరాల ప్రకారం చేజర్ల పోలీసు స్టేషన్ పరిధిలోని మండలప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోసం పోలీసు స్టేషన్‌ను ఆశ్రయిస్తున్నప్పటికి రెగ్యులర్ ఎస్సై లేకపోవడం వల్ల కేసుల విచారణలు, ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని తెలిపారు. మండల ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా వెంటనే పూర్తి స్థాయి ఎస్సైని నియమించాలని కోరారు. చేజర్ల మండల ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పోలీసు స్టేషన్‌కు రెగ్యులర్ ఎస్సైని నియమించి ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరక్టరన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బత్తల కృష్ణయ్య, బీజేపీ చేజర్ల మండల అధ్యక్షుడు గుండాల విజయ భాస్కర్‌రెడ్డి, మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## చేజర్ల ఆర్టీసీ బస్సుల సమస్యలపై నేడు ప్రత్యేక సమావేశం

– నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్ రాక

**చేజర్ల, మే31, ప్రభాతవార్త :** చేజర్ల మండల ప్రజలు ఎదుర్కొంటున్న ఆర్టీసీ బస్సుల సమస్యల పరిష్కారానికి కీలక చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఆత్మకూరు డిపోకు చెందిన బస్సులు నిర్ణీత సమయాలకు రాకపోవడం, తరచూ ఆలస్యంగా నడవడం వల్ల విద్యార్దులు, ఉద్యోగులు, వ్యాపారులు, గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి సోమవారం చేజర్లకు రానున్నారు. ఉదయం 10గంటలకు చేజర్ల బస్టాండ్ సెంటర్‌లో ఆర్టీసీ అధికారులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు బీజేపీ మండల నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో బస్సుల సమయపాలన, గ్రామీణ ప్రాంతాలకు సరిపడా సర్వీసుల నిర్వహణ, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, విద్యార్థుల రవాణా సమస్యలు, రద్దీ సమయాల్లో అదనపు బస్సుల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించనున్నారు. ఇటీవల కాలంలో ఆత్మకూరు డిపోకు చెందిన బస్సులు సమయానికి రాకపోవడం వల్ల ప్రయాణికులు గంటల తరబడి బస్టాండ్‌లలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఉద్యోగులు, అత్యవసర పనుల నిమిత్తం ప్రయాణించే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పటికి ఆశించిన స్థాయిలో పరిష్కారం లభించలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సోషల్ మీడియాతో పాటు వివిధ పత్రికల్లో వార్తలు రావడంతో జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి స్వయంగా విచ్చేసి ప్రజల అభిప్రాయాలను తెలుసుకోనున్నారు. సమావేశంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని బీజేపీ మండల నాయకులు కోరారు. ఆర్టీసీ సేవలను మరింత మెరుగుపరచడంతో పాటు చేజర్ల మండల ప్రజలకు నాణ్యమైన రవాణా సౌకర్యాలు అందేలా సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## చీప్ లిక్కర్ వలన గౌడ సోదరుల వృత్తిలో నష్టాలు




**కోవూరు, మే31ప్రభాతవార్త :** కోవూరు మండలం మోడేగుంట పంచాయతీ గమళ్లపాలెంలో గ్రామ గౌడ నేతల ఆధ్వర్యంలో గౌడ సంక్షేమ సంఘం నెల్లూరు జిల్లా నూతన కమిటీ పరిచయకార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ పరిచయ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా జిల్లా అధ్యక్షుడు తిరకాల శీనయ్య గౌడ్ , జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో గౌడ కులస్తుల జనాభా అధికంగా ఉండడంతో పాటు రాజకీయంగా చైతన్యవంతంగా ఉన్నారన్నారు. చీప్ లిక్కర్ వలన గౌడ సోదరులు వారి వృత్తిలో నష్టాలు చవి చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గౌడ సోదరులంతా ఒక తాటి మీద ఉండి ఒకే మాట ఒకే బాటలాగా ఉండడానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కలిసికట్టుగా ఉంటే మనకు రావాల్సిన హక్కులు, రాజకీయ రిజర్వేషన్ కోసం పోరాటి మన హక్కులు మనమే కాపాడుకుంటామన్నారు. ఉపాధ్యక్షుడు భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కమిటీ ప్రతి గ్రామంలో తిరుగుతూ వారి హక్కుల కోసం పోరాటం చేయవలసిన అవసరం ఉందన్నారు. చీప్ లిక్కర్ తాగడం వలన అనారోగ్యం పాలవుతున్నారని, కల్లు ఆరోగ్యానికి మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నేతలు అన్నం దయాకర్ గౌడ్, రాజారామ్ గౌడ్, మురళి గౌడ్, భాస్కర్ గౌడ్, శ్రీనివాసులు గౌడ్, సుబ్రహ్మణ్యం గౌడ్, తదితరులు ఉన్నారు.

## ఏ బస్సు చూసినా ఫుల్

– ప్రయాణికుల కష్టాలు వర్ణనాతీతం



**కోట, మే 31 ప్రభాతవార్త :** జిల్లాలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణమంటేనే జనం విసిగిపోతున్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సర్వీసులు లేకపోవడమే ఇందుకు కారణం. ఇక్కడ వాకాడు డిపోను 1992లో అప్పటి సీఎం నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి మంజూరు చేయించారు. నాడు దాదాపు 120 బస్సుల వరకు డిపోలో ఉండేవి. ఆ బస్సు సర్వీసులు ఇక్కడి నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పుట్టపర్తి, తదితర ప్రాంతాలకు నడిచేవి. ప్రస్తుతం వాకాడు డిపోలో 44 బస్సులు మాత్రమే ఉన్నాయి. ఈ బస్సుల కోసం ప్రయాణికులు ప్రతిరోజు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కోట ఆర్టీసీ బస్టాండులో ఏ బస్సు చూసినా జనాలతో నిండిపోతుంది. అత్యవసరంగా ప్రయాణం చేయాల్సి వస్తుండటంతో వందల కిలోమీటర్ల దూరం ప్రయాణికులు నిలబడి రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. అదనంగా బస్సు సర్వీసులు నడపాలని ఈ ప్రాంత ప్రయాణికులు స్థానిక ప్రజాప్రతినిధులను, అధికారులను కోరుతున్నారు. ఆదివారం వాకాడు డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సులు రద్దు కారణంగా ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు.

**డిఎం వివరణ:** ఆదివారం పల్లె వెలుగు బస్సులు రద్దు చేయడంతో ప్రయాణీలకు ఇబ్బంది పద్దారన్న విషయమై వాకాడు డిపో మేనేజర్ షెక్.కరీమునిసా ను ప్రభాతవార్త వివరణ అడగగా ఒక పల్లె వెలుగు బస్సును రద్దు చేయడం జరిగిందని చెప్పారు.

## ఎట్టకేలకు ఫ్లైఓవర్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

**బిట్రగుంట మే 31 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన బోగోలు లోని 144వ ఎల్ సి గేట్ వద్ద సుమారు 13 సంవత్సరాల కిందట మంజూరైన ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అడ్డంకులన్నీ తొలగిపోయి గ్రీన్ సిగ్నల్ పడింది. గతంలో పలుమార్లు ఈ నిర్మాణానికి సంబంధించిన డిపిఆర్ లు రూపొందించడంలో ఆర్ అండ్ బి, రైల్వే శాఖల మధ్య సమన్వయం లోపించడంతో దీనివల్ల ప్రజలు ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణం జరగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం విధితమే. ఈ విషయం పలుమార్లు పత్రికలలో ప్రచురితమైన, ప్రజాప్రతినిధులు స్పందించిన నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. దీంతో కావలి ఎమ్మెల్యే డివి కృష్ణారెడ్డి చొరవచూపడంతో శనివారం ఆయన నివాసంలో ఆర్ అండ్ బి రైల్వే శాఖలు కు చెందిన ఉన్నతాధికారులు సమావేశమై ఇందుకు సంబంధించిన డిపిఆర్ ని ఖరారు చేశారు. అందులో భాగంగా బోగోలు, విశ్వనాథరావుపేట మేజర్ పంచాయతీలను కలుపుతూ బోగోలు పడమర వైపు నుండి బేతనియపేట చర్చి వరకు, అక్కడ నుండి ఇబ్రహీంపేట మీదుగా ఈ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఎమ్మెల్యే తో సంప్రదింపులు జరిపిన తర్వాత ఈ రెండు శాఖలకు చెందిన అధికారులు బోగోలుకువచ్చి నిర్మాణపు కొలతలను కూడా ఖరారు చేశారు. దీంతో ఎట్టకేలకు దశాబ్దపు కాలంగా వేచి చూస్తున్న మండల ప్రజానీకానికి ఎంతో ఆనందాన్ని కలగజేసింది. ఇందుకు చొరవ చూపిన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డికి మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఇకనైనా జాప్యం లేకుండా త్వరితగతిన రైల్వే గతి శక్తి శాఖ అధికారులు నిర్మాణాన్ని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వారి విజ్ఞప్తి చేస్తున్నారు

## ముదివర్తిలో విద్యుత్ శాఖ మెరుపు దాడులు

**విడవలూరు, మే 31 ప్రభాతవార్త:** మండలం ముదివర్తి గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు మెరుపు దాడులు నిర్వహించి దొంగ విద్యుత్ కనెక్షన్లను గుర్తించారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తూ ఏసీలు నడుపుతున్న ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు విద్యుత్ శాఖ ఏఈ విజయకుమారి తెలిపారు. తనిఖీల్లో విద్యుత్ చౌర్యం జరిగినట్లు నిర్ధారణ కావడంతో ఒకరికి రూ.28 వేలు, మరొకరికి రూ.36 వేలు చొప్పున విద్యుత్ వినియోగ చార్జీలు విధించినట్లు పేర్కొన్నారు. విద్యుత్ చౌర్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, అక్రమ విద్యుత్ వినియోగంపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆమె హెచ్చరించారు.

## నేడు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పర్యటన

**కొడవలూరు, మే 31 ప్రభాతవార్త:** కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యురాలు, టీడీపీ పొలిట్బ్యూరో సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సోమవారం కొడవలూరు మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు నాపై వెంకటేశ్వర్లు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు నార్త్ రాజుపాలెంలోని చంద్రబాబు నాయుడు కాలనీలో నిర్వహించే 'పేదల సేవలో' కార్యక్రమంలో పాల్గొని పెన్షన్లు పంపిణీ చేయడంతో పాటు తాగునీటి సరఫరా పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. అనంతరం ఉదయం 8 గంటలకు కమ్మపాలెం పంచాయతీలో ఏర్పాటు చేసిన వీపీఆర్ నేత్ర కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాలకు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.



## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

## సీఐ ఓ. దుర్గాప్రసాదరావు హెచ్చరికొడవలూరు

**విడవలూరు, మే 31ప్రభాతవార్త:** ప్రజా భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని, ప్రతి ఒక్కరూ చట్టాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కొడవలూరు – విడవలూరు సీఐ ఓ.దుర్గాప్రసాదరావు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం, ర్యాష్ డ్రైవింగ్, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపడం వంటి చర్యలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహన పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు గాయపడిన వారికి వెంటనే సహాయం చేసి ఆసుపత్రికి తరలించాలని, మానవత్వంతో స్పందించాలని కోరారు. రొయ్యల సాగు రైతులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని, నిషేధిత రసాయనాలు వినియోగిస్తే చర్యలు తప్పవని తెలిపారు. చెరువుల్లో చికెన్ వ్యర్థాలను ఉపయోగిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు .గంజాయి విక్రయాలు, రవాణాను అరికట్టేందుకు ప్రజల సహకారం అవసరమని సీఐ పేర్కొన్నారు. గంజాయి సంబంధిత సమాచారం పోలీసులకు అందించాలని, సమాచారందారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



## ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



**బిట్రగుంట మే 31 ప్రభాతవార్త :** బోగోలు సెంటర్ నందు గల షాపుల యజమానులకు షాపుల ఎదుట ట్రాఫిక్ కు ఇబ్బంది కలిగించకుండా వాహనాలను నిలుపనివ్వరాదని, అలాగే షాపుల యజమానులు తమ షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని బిట్రగుంట పోలీస్ స్టేషన్ ఎస్ఐ రామ క్రిష్ణ ఆదివారం వ్యాపారస్తులకు కౌన్సిలింగ్ మరియు అవగాహన కల్పించడం జరిగినది.

## గ్రంథ పఠనం చిన్నారులకు ఎంతో ఉపయోగకరం




**కోవూరు, మే 31ప్రభాతవార్త :** ప్రాథమిక దశ నుంచి ప్రతి విద్యార్థి గ్రంథ పఠనం చేయడం ద్వారా వారిలో దాగి ఉన్న అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఉపాధ్యాయులు పి. రంగారెడ్డి తెలిపారు. కోవూరులోని పచ్చిపాల శంకర్ రెడ్డి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా ఆదివారం చిన్నారులకు పలు నీతి కథలకు సంబంధించిన విషయాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రంథాలయంలో మహనాయులకు సంబంధించిన చరిత్ర పుస్తకాలు ఉన్నాయని, వాటిని పూర్తిగా చదివి ఆకళింపు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ బాండాగారి వై. సురేంద్రరెడ్డి, విద్యార్థులు ఉన్నారు.

## సైడ్ కాలువకు గోడలు లేక ప్రమాదం



**కోవూరు, మే31ప్రభాతవార్త :** కోవూరు మండలం సాలుచింతల సెంటర్ సమీపంలో ఉన్న నల్లకాలువకు సైడు కాలువ గోడలు లేకపోవడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. నిత్యం ఈ రహదారి గుండా వందలాది వాహనాలు రాత్రి పగలు అనే తేడా లేకుండా ప్రయాణిస్తున్నాయి. ఈ ప్రాంతంలోనే పెట్రోల్ బంక్ కూడా ఉంది. కనీసం ఈ నల్లకాలువకు ఒకవైపు మాత్రమే సైడ్ కాలువ గోడ ఉంది తప్ప ఎడమవైపు సైదు కాలువ పూర్తిగా ధ్వంసమైంది. దీంతో రాత్రి వేళల్లో ఈ కాలువ ప్రాంతంలో ఎవరైనా ఆదమరిచి ప్రయాణిస్తే మృత్యువాత పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. శనివారం రాత్రి కోవూరు నుంచి నెల్లూరుకు పోతున్న ఓ జంట అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం లేకుండా తేలికపాటి గాయాలతో బయటపడ్డారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు నల్లకాలువకు ఎడమవైపు గోడను నిర్మించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

## వ్యవసాయ కళాశాల నందు పొగాకు వ్యతిరేక దినోత్సవం




**ఉదయగిరి, మే31, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ కళాశాలలో మే 31 ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని కళాశాల అసోసియేట్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల నుండి స్థానిక బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల జాతీయ సేవాపథకం అధికారిణి డాక్టర్ ఎన్.సునీత అధ్యక్షత వహించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు విభాగాధిపతులు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ పొగాకు వల్ల వచ్చే దుష్పరిణామాలు అనార్థాలు వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి అన్ని విభాగాధిపతులు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## జనగణన జూన్ 7 వరకు పొడిగింపు

**బిట్రగుంట మే 31 ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన జనగణన కార్యక్రమాన్ని జూన్ 7వ తేదీ వరకు పొడిగించినట్లు మండల తాసిల్దార్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. కాగా మండలంలోని అన్ని గ్రామాల్లో డోర్ లాక్ అయిన వాటిని మరోసారి పరిశీలించి జనగణన సిబ్బంది నమోదు చేయాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు.

## సంగం మండలంలో భారీ ఈదురు గాలుల భీభత్సం



**సంగం మే 31 ప్రభాతవార్త :** సంగం మండలంలోని తలుపూరుపాడు, తరుణవాయి, కొరిమెర్ల,జంగాల కండ్రికలో ఆదివారం ఈదురు గాలులు భీభత్సం సృష్టించాయి. పలు ప్రాంతాలలో భారీ చెట్లు



నెలకొరిగాయి. ఈదురుగాలుకు విద్యుత్‌లైన్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారంలో పలుగ్రామాలు చిక్కుకోవడంతో సమాచారం అందుకున్న వెంటనే విద్యుత్ శాఖ అధికారులు రంగంలోకి దిగి దెబ్బతిన్న లైన్లను యుద్ధప్రాతిపదికన మరమ్మత్తులు చేశారు.

## శాఖాహారం పై అవగాహన ర్యాలీ




**గూడూరు, మే 31, ప్రభాతవార్త :** గూడూరులోని బుద్ధా పిరమిడ్ ధ్యాన ఆశ్రమం, ఆధ్వర్యంలో గూడూరు పట్టణం లోని పలు విధుల్లో శాఖాహార ర్యాలీ జరిగి ంది. శాఖాహారం పై విస్తృత ప్రచారం కల్పిం చారు. ఈ సందర్భంగా ఆశ్రమం నిర్వా హకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ డబ్ల్యుహె చ్వో నివేదికల ప్రకారం ఆరోగ్యానికి సరియైన ఆహారం శాకాహారం మాత్రమే అని నిరూపిం చబడిందని, శాకాహారంతోనే అద్భుతమైన ఆరోగ్యాన్ని, ఆనందకరమైన జీవనాన్ని పెంపొందించగలమని, అందువల్ల మా గురువు బ్రహ్మర్షి పితామ పత్రీజీ దివ్యస్ఫూర్తితో పట్టణ ప్రజలకు శాకాహారం పై విస్తృత అవగాహన కల్పిస్తున్నామని, అలాగే మానసిక ఒత్తిడి, ప్రశాంతత, అద్భుతమైన ఆరోగ్యకరమైన జీవనంతో జీవించడానికి గూడూరు పట్టణంలోని బుద్ధా పిరమిడ్ ధ్యాన ఆశ్రమం నందు ప్రతి ఆదివారం ఉచిత ధ్యాన తరగతులు నిర్వహిస్తున్నట్లు, ఈ అవకాశాన్ని గూడూరు పట్టణ, పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సి ందిగా కోరారు. ఈ కార్యక్రమంలో గోపీనాథ్, లత, సంధ్య, రాంభద్రారెడ్డి, శివకుమార్ రెడ్డి, పిరమిడ్ మాస్టర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భూమిలేని పేదలకు తిప్ప భూములు దక్కే వరకు పోరాటం ఆగదు

– కొమ్మరపూడిలో సిపిఐ ఎర్ర జెండా ఆవిష్కరణ   భారీ ర్యాలీ బహిరంగ సభ




**నెల్లూరు అగ్రికల్చర్, మే 31, ప్రభాతవార్త :** గ్రామంలోని పేదలకు కొమ్మరపూడి తిప్ప భూములు దక్కే వరకు అలుపెరుగని పోరాటం సాగిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెలసాయి అన్నారు. ఆదివారం నెల్లూరు రూరల్ మండ్నల కొమ్మరపూడిలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో ఎర్రజెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి, సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి సీనియర్ నాయకులు వివేకం రామరాజు పాల్గొని పార్టీ జెండాలను ఆవిష్కరించారు. భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం సిపిఐ మండల కార్యదర్శి కె. చిన్న అంకయ్య అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం పేదలకు భూములు ఇవ్వాలని, దున్నేవాడిదే భూమి నినాదంతో దేశవ్యాప్త ఉద్యమాలు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నడిపిందని, దాని ఫలితంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భూ సంస్కరణల చట్టం తెచ్చి తద్వారా పేదలకు లక్షలాది ఎకరాల భూములు పంచిందని గుర్తు చేశారు. సిపిఐ పార్టీ ఆస్ఫూర్తితోనే ఈ ప్రాంతంలో కొండ్లపూడి, కొత్త వెల్లంటి, పాత వెల్లంటి, సజ్జాపురం, ములుమూడి, సౌత్ మోపూరు గ్రామాలలో భూ పోరాటాల ద్వారా పేద ప్రజలకు భూములు పంచిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. వ్యవసాయ భూములు దక్కితే పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయనే లక్ష్యంతో సిపిఐ పార్టీ ముందుకెళుతుందన్నారు. పేద ప్రజలు ఐక్యంగా ఉండి సిపిఐ పార్టీకి సహకరించి, పోరాటాలు సాగిస్తే భూములు దక్కుతాయని, పోరాటపటిమతో భూములు సాధించుకునే వరకు అందరూ తమ వెంట నడవాలని పిలుపునిచ్చారు. అనంతరం సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి వివేకం రామరాజు మాట్లాడుతూ కొమ్మరపూడి తిప్ప భూముల విషయంలో రాజీలేని పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. భూస్వాముల ఆగడాలు చెల్లవని, ఎవరు అడ్డొచ్చినా పేదల హక్కుల సాధన కోసం పోరాటాన్ని ఆపలేరని హెచ్చరించారు. సిపిఐ నెల్లూరు రూరల్ మండల కార్యదర్శి కామ్రేడ్ కొప్పోలు చిన్న అంకయ్య మాట్లాడుతూ కొమ్మరపూడి తిప్ప భూములు కేవలం ఒక వర్గానికే కాకుండా అన్ని సామాజిక వర్గాల పేదలకు సమానంగా కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, ఓసి పేదలు సహా ప్రతి నిరుపేద కుటుంబానికి భూమిపైన సమాన హక్కు ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పీ. లీలా మోహన్, సిపిఐ నెల్లూరు రూరల్ మండల సహాయ కార్యదర్శి వై. ఆదినారాయణ, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి తల్లు సీనయ్య, కొమ్మరపూడి తిప్ప భూముల సాధనా కమిటీ నేతలు ఉప్పునూతల జనార్ధన్, ఎస్కే ఖాజా మస్తాన్, చంద్రగిరి చిన్నయ్య, ముత్తంగి విష్ణు, కొర్రా రఫీ, శీనయ్య, కాకి నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

## ఏడు మంది పేకాట రాయుళ్లు అరెస్టు



**పొదలకూరు, మే 31, ప్రభాతవార్త :** పొదల కూరు మండలంలోని తాటిపర్తి స్మశాన వాటిక వద్ద కొంత మంది పేకాట ఆడుతూ వున్నారన్న రహస్య సమాచారంతో దాడులు నిర్వహించామని ఎస్ ఐ తెలిపారు. ఈ దాడిలో 7 మంది పేకాట ఆడుతూ వున్న వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 5000 రూపాయలు స్వాధీనం చేసున్నామని ఎస్ఐ తెలిపారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నెల్లూరు విద్యుత్ భవన్‌లో ప్రతి సోమవారం డయల్ యువర్ ఎస్.ఈ కార్యక్రమం

– సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘవేంద్రం వెల్లడి



**నెల్లూరు వైద్యం, మే 31, ప్రభాతవార్త :** నెల్లూరు విద్యుత్ భవన్‌లో ప్రతి సోమవారం డయల్ యువర్ విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యక్రమాని ప్రతి సోమవారం ఉదయం 8.30 నుండి 9.30 గంటల వరకు 0861-2320427 చరవాణి నెంబర్‌లో నిర్వహించబడుతుందని జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘవేంద్రం తెలిపారు. అలాగే ఏపీఎస్ పిడిసిఎల్ సిఎండీ కూడా ప్రతి సోమవారం తిరుపతి కార్పొరేట్ కార్యాల యంలో డయల్ యువర్ సిఎండీ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10.00 నుండి మధ్యాహ్నం 12.30 వరకు 8977716661 చరవాణి నెంబర్‌లో నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సంబంధిత సమస్యలు, సూచనలు చరవాణిలో నేరుగా తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ రాఘవేంద్రం కోరారు.

## కోడిపందేల స్థావరంపై పోలీసుల మెరుపు దాడి



**వింజమూరు, మే 31, ప్రభాతవార్త:** జిల్లాలో చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసు శాఖ ఉక్కుపాదం మోపుతోంది. జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల ఆదేశాల మేరకు శనివారం వింజమూరు పోలీసులు కోడిపందేల స్థావరంపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. వింజమూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని శివారు ప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే ఖచ్చితమైన సమాచారం అందుకున్న పోలీసులు పగడ్బందీగా రైడ్ చేశారు. ఈ దాడిలో కోడిపందేల్లో పాల్గొంటున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి కోడిపందేలకు ఉపయోగిస్తున్న 6 పుంజులను, రూ. 8,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా వింజమూరు ఎస్ఐ ఎం. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వింజమూరు మండల పరిధిలో కోడిపందేలు, పేకాట, మట్కా, గ్యాంబ్లింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలా పాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలు సహకరిస్తేనే ఇటువంటి నేరాలు పూర్తిగా అరికట్టగలంఅని పేర్కొన్నారు. కోడిపందేలు, పేకాట లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాల సమాచారం ఉంటే వెంటనే డయల్ 112 ద్వారా పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ దాడిలో ఎస్ఐ ఎం. ఉమామహేశ్వరరావుతో పాటు వింజమూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## డిసిపల్లి పొగాకు వేలం కేంద్రం వద్ద రైతులతో మంత్రి ముఖాముఖి



**మర్రిపాడు, మే31, ప్రభాతవార్త:** రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామ నారాయణరెడ్డి సోమవారం ఉదయం 9.30గంటలకు మర్రిపాడు మండలం డిసిపల్లిలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని, మొదట డిసిపల్లి సెంటర్‌లో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేస్తారని, అనంతరం స్థానిక పొగాకు వేలం కేంద్రం వద్ద రైతులతో ముఖా ముఖి కార్యక్రమంలో పాల్గొంటారని మంత్రి రామానారాయణరెడ్డి క్యాంప్ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు.

## 'సాగరం' ఎస్ఐని కలిసిన మెట్టుకూరు



**అనంతసాగరం, మే31, ప్రభాతవార్త:** మండలకేంద్రమైన అనంతసాగరం నూతన ఎస్ఐ రాజేష్‌ను ఆదివారం వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర ఉపాధ్యాయసంఘం ఉపాధ్యక్షుడు మెట్టుకూరు సుబ్బారెడ్డి, వైసిపి నాయకులు బత్రెడ్డి నాగేంద్రలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎస్ఐ రాజేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

## కావలి ట్రాఫిక్ సిబ్బందికి ఎండల నుంచి రక్షణకు సామాగ్రి పంపిణి



**కావలి, మే 31 ప్రభాతవార్త :** జిల్లాలో నెలకొన్న ఎండలు, అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని జిల్లా పోలీస్‌శాఖ సిబ్బంది సంక్షేమానికి ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో జిల్లా ఎస్పి అజిత్ వేజెండ్ల ఆదేశాల మేరకు ఆదివారం డిఎస్‌సి కార్యాలయంలో డిఎస్‌పి వివి.రమణకుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి తెలుపు రంగు టోపీలు, చలువ అద్దాలు, వాటర్ బాటిళ్ళు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ప్రజల భద్రత, సౌకర్యమే పోలీస్‌శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ట్రాఫిక్ రోజురోజుకు పెరుగుతుండడంతో పలీస్ సిబ్బంది మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సమస్యలపై సానుకూలంగా స్పందించాలని పోలీసులకు సూచించారు. వ్యక్తిగత క్రమశిక్షణ, విధినిర్వహణలో బాధ్యతగా ఉండాలని సూఇచంచారు. ట్రాఫిక్ సమస్యపై దశల వారీగా పరిష్కరించి ప్రజలకు మరింత నాణ్యమైన సేవలను అందించే దిశగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో ట్రాఫిక్ పోలీసులకు కావాల్సిన మరిని సౌకర్యాలు, వసతులను అందిచేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్లు ఫిరోజ్, గిరిబాబు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## మతిస్థిమితంలేని మహిళపై అత్యాచారం




**మనుబోలు మే 31 ప్రభాతవార్త :** మనుబోలు మండలంలోని కాగితాలపూరు క్రాస్ రోడ్డు వద్ద సుమారు 30 సంవత్సరాలు వయస్సు కలిగిన మితిస్థిమితం బాగులేని మహిళపై విచక్షణ రహితంగా దాడి చేసి అత్యాచారం చేసిన ఘటన ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు ఈ మహిళ గత సంవత్సరకాలంగా ఈ జంక్షన్ వద్దే సంచరిస్తు అక్కడ దుకాణదారులు పెట్టింది తింటు అక్కడే నిద్రించడం జరుగుతుందని అయితే తెల్లవారు జామున ఈ మహిళపై విచక్షణ రహితంగా దాడి చేసి అత్యాచారానికి పాలుపడ్డారని అక్కడే దుకాణదారుడు ఇచ్చిన కంప్లైంట్ ఆధారంగా డిఎస్‌పి ఘట్టమనేని శ్రీనివాసరావు మరియు పొదలకూరు సిఐ వెంకట్రావ్ ఎస్ఐ శివరాకేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు పరచి దర్యాప్తు చేపట్టారు.

## పౌర్ణమి సందర్భంగా రామలింగేశ్వర స్వామికి అభిషేకాలు



**బిట్రగుంట మే 31 ప్రభాతవార్త :** బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీలోని రామస్వామి పాలెం లో శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం నందు పౌర్ణమి సందర్భంగా శ్రీ విఘ్నేశ్వర స్వామికి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి రామలింగేశ్వర స్వామి వారికి ఆదిత్యాది నవగ్ర హాలకు జంట నాగులకు నందీశ్వరునికి బోగోలు బిట్రగుంట బ్రాహ్మణ అర్చక పురోహితులచే ఆదివారం పంచామృత అభిషేక కార్యక్రమాలు జరిగాయి. రామలింగేశ్వర స్వామికి రుద్రాభిషేకం నిర్వహిం చారు, విశేష అలంకరణ నైవేద్యాలు మంగళ హారతులును అర్చక బృందం సమర్పించారు. అర్చక బృందం ఆలయ వ్యవస్థాపకులు బత్తుల రవిచంద్ర సన్మాన కార్యక్రమం చేసినారు. తదుపరి సహపంక్తి అన్నప్ర సాదాలను స్వీకరించారు. వచ్చినటువంటి భక్తులకు అర్చనలు నిర్వహించి, అన్నప్రసాదాలు తీర్థప్రసాదాలు అందించారు.

## జగనన్నను మళ్ళీ గెలిపించాలనే తపనతో ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేస్తున్నాం





**నెల్లూరు వైద్యం, మే 31, ప్రభాతవార్త :** జగనన్నను మళ్ళీ గెలిపించాలనే తపనతో ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేస్తున్నామని వైసిపి రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత పేర్కొన్నారు. ఆదివారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు వెన్నుపోటు పాలనకు రెండేళ్లు అనే కార్యక్రమంలో వైసిపి స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, స్టేట్ మహిళా ప్రెసిడెంట్ వరుదు కళ్యాణి, రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాకాణి పూజిత మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి అనుకున్న దానికంటే చాలా ఎక్కువ సంఖ్యలో, మహిళలు తరలిరావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పార్టీ విజయం అనేది కేవలం కొద్దిమంది నాయకుల వల్లే సాధ్యం కాదు, అది క్షేత్రస్థాయిలో ప్రజలు చూపిస్తున్న ఆదరణపై ఆధారపడి ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో నేను గమనించిన దాని ప్రకారం.. ప్రతి ఒక్క మహిళ, కార్యకర్త జగనన్నను మళ్ళీ గెలిపించాలి అనే బలమైన తపనతో, ఆకాంక్షతో పనిచేస్తున్నారు జగనన్న విజయం కోసం అంకితభావంతో శ్రమిస్తున్న ప్రతి ఒక్క మహిళకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. టిడిపి నాయకులు జరుపుకున్నది మహానాడు కాదు, అబద్ధాలను నిజాలుగా చూపే మాయానాడు చంద్రబాబు నాయుడు, లోకేష్‌లు చెప్పే అబద్ధాలను మహానాడుకు వచ్చిన మహిళా ప్రతినిధులు కూడా అంతే నమ్మకంగా ఎలా మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డి గారు ఉన్నప్పుడు ఎలాంటి ప్రచారం చేసుకోకుండా పాలన సాగించారన్నారు. జగనన్న ప్రజలకు చేసిన మంచి పనులన్నింటినీ, చంద్రబాబు చేశాడంటూ మహానాడు వేదికగా టీడీపీ నాయకులు ప్రగల్భాలు పలుకుతున్నారని, జగనన్న పేరు ఎత్తకుండా టీడీపీ ఒక్క కార్యక్రమం కూడా చేయలేక పోతుందన్నారు. టీడీపీ నాయకులకు జగనన్న అంటే లోపల భయము, భక్తి ఉన్నాయన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన దిశ యాప్ ను పేరు మార్చి (శక్తి యాప్)ను చంద్రబాబు, తామే తెచ్చామని చెప్పుకోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్ల జీతాలు పెంచింది జగనన్న అయితే, ఆ క్రెడిట్ కూడా తామే తీసుకునేందుకు టీడీపీ దిగజారిందన్నారు. మహిళలకు ఏమీ తెలియదనో, లేదా ప్రజలు పాత విషయాలు మర్చిపోయారనో టీడీపీ నాయకులు ఇలాంటి అబద్ధాలు ఆడుతున్నారు కానీ ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళల రక్షణ కరవైంది ప్రతిరోజు ఏదో ఒక చోట మహిళలపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. మనమందరం కష్టపడి మళ్లీ జగనన్నను గెలిపించుకోవాలని ఈ రాష్ట్ర భవిష్యత్తు జగనన్న మీదే ఆధారపడి ఉందన్నారు.

## వెంకన్నపాలెంలో పౌర హక్కుల దినోత్సవం

**కోట, మే 30 ప్రభాతవార్త :** కోటలోని నార్తు గిరిజన కాలనీలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కె.జయజయరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులను వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఎవరికైనా అన్యాయం జరిగితే నేరుగా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చుని తెలిపారు. రెవెన్యూ సమస్యల పరంగా తన వద్దకు రావాలని సూచించారు. ఎస్సీల కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ ఎఇ భాస్కర్‌రావు, సూపర్‌డెంట్ శివకూమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కావలిలో పలు ప్రాంతాల్లో క్లీన్ స్వీప్ కార్యక్రమం



**కావలి, మే 31 ప్రభాతవార్త :** ఈనెల 22 నుండి జూన్ 20వరకు 36రోజులు పాటు స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కావలి మున్సిపల్ కమి షనర్ జి.శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక 2వ వార్డుగాయత్రినగర్, పుట్ట వీది 12, 13 వార్డుల్లో 28వ వార్డు ఉదయగిరి బ్రిడ్జి కింద రైల్వేట్రాన్ లైన్ నందు, 40వ వార్డు ట్రంకురోడ్డు తదితర ప్రాంతాల నందు క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించి రోడ్డును, డ్రైన్‌లను అక్కడి పరిసర ప్రాంతాలను శుభ్రపరచడం జరిగింది. మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్, మున్సిపల్ సిబ్బంది, ఎస్‌హెచ్‌జి గ్రూపు సభ్యులు, వార్డు ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

## కావలి ఇందిరమ్మ కాలనీలో కార్డెన్‌సెర్చ్




**కావలి, మే 31 ప్రభాతవార్త :** కావలి ఇందిరమ్మ(తిప్ప)కాలనీలో కావలి రూరల్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ జి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించి ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి మాదకద్రవ్యాలు, మారణాయుధాలు ఇతర అసాంఘీక కార్యక్రమాలు జరుగుతున్నాయా అని పరిశీలించడం జరిగింది. ఈ పరిశీలనలో ఎటువంటి పత్రాలు లేని 34మోటార్ బైకులు, 13 ఆటోలను సీజ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ రాజేశ్వర్‌రావు మాట్లాడారు. జిల్లా ఎస్పి అజిత్ వెజెండ్ల ఆదేశాల మేరకు కావలి డిఎస్‌పి వెంకటరమణ సూచనలతో ఇందిరమ్మ కాలనీలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించడం జరిగిందన్నారు. దొంగతనాలు ఇతర నేరాలపై కాలనీ ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ప్రతి ఇంటి వద్ద సీసీ కెమరాలు ఏర్పాటుచేసుకున్నట్లయితే దొంగల బారి నుండి ర క్షించుకోవడం కాకుండా దొంగలను పట్టుకునేందుకు కెమరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపరాఉ. బయట ఊర్లకు ఎవరైనా వెలితే తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా కాలనీలో సంచరిస్తున్న వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐలు తిరుమలరెడ్డి, బాజీబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మన్నెమాల ఆదేశాలతో చలివేంద్రాలలో మజ్జిగ పంపిణి



**కావలి, మే 31 ప్రభాతవార్త :** సీనియర్ నాయకులు, కావలి మాజీ ఏఎంసి ఛైర్మెన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరి సంజయ్(చిన్న) వారి మిత్రబృందం ఆధ్వర్యంలో పట్టణంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లో ఆదివారం మజ్జిగను పంపిణీ చేయడం జరిగింది. ఈస ందర్భంగా ఆత్మకూరి చిన్న మాట్లాడుతూ పట్టణంలో ఎండలు తీవ్రంగా ఉన్నందున మన్నెమల సుకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పలు కూడలిలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలు, పాదాచారులు దాహర్తిని తీర్చడమే కాకుండా ప్రతి ఆదివారం మజ్జిగను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈచలివేంద్రాల్లో మంచినీరు, మజ్జిగను తాగి ఎంతో దాహర్తిని తీర్చుకొని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంతో మన్నెమాల సుకుమార్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఆత్మకూరు ఆర్టీసి డిపోను సందర్శించిన నెల్లూరు రీజనల్ ఛైర్మెన్



**ఆత్మకూరు, మే31, ప్రభాతవార్త:** ఆత్మకూరు ఆర్టీసి డిపోను నెల్లూరు ఆర్టీసి రీజనల్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఆది వారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన ఆర్టీసి ఉద్యో గస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహిం చారు. గతంలో ఉన్న సమస్యలపై ప్రస్తుతం చేపట్టాల్సిన చర్యలపై ఛైర్మెన్ అధికారులతోచర్చించారు. ప్రయాణీ కులకు మెరుగైన సేవలు అందించే క్రమంలో అవసరమైన ప్రాంతంలో డిపో పరిధిలో ఉన్న బస్సుల వేళలుమార్పులు, ప్రయాణీకులకు అవసరమైన సేవలపై చర్చించి మున్సిపల్ బస్టాండ్‌లో కావాల్సిన వసతులు ఏర్పాటు చేయమని అధికారులకు సూచించారు. ఈసందర్భంగా రీజనల్ ఛైర్మెన్ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీశక్తి పథకం ద్వారా రాష్ట్రంలో ప్రయాణీకుల రద్దీ నెలకొందని అందుకు అనుగుణంగా బస్సులు లేవని ఉన్న బస్సులనే ప్రజలకు ఇబ్బంది లేకుండా నడుపుతున్నామన్నారు. పొల్యూషన్ నిర్మూలన , డీజిల్ కొరతతో త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా 4వేలకు పైగా ఎలక్ట్రికల్ మరియు సిఎన్‌జి బస్సులను రాష్ట్రంలో నడిపేందుకు ప్రతిపాదన చేశావన్నారు. త్వరలో వాటిని డిపోలకు పంపుతామన్నారు. ఆ బస్సులకు అవసరమైన సర్వీస్ పాయింట్లను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. డిపోమేనేజర్ శివకేష్ యాదవ్, అసిస్టెంట్ మేనేజర్ రాజ్‌కుమార్, డిపో ఉద్యోగులు సుధీర్, పద్మారావు, వెంకటేశ్వర్లు, ప్రతాప్‌రెడ్డి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## గుంతల రోడ్డుతో నరకయాతన..!

– పట్టించుకోవాలంటూ ప్రజల వేడుకోలు



**దగదర్తి, మే31, ప్రభాతవార్త :** దగదర్తి నుండి బుచ్చిరెడ్డిపాలెం వెళ్లే రోడ్డు గుంతలపడి అధ్వాన్నంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వం రూ.38 కోట్లు నిధులు మంజూరు చేసి కాంట్రాక్టర్లతో పనులు చేపట్టింది. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికి రోడ్డు పనులు పూర్తి కాలేదు. వాహనదారులు, మండల ప్రజలు గుంతలపడిన అధ్వాన్నమైన రోడ్డులో ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకొని ఆ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## వరిగొండలో నేడు సోలార్, పెన్షన్, పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హాజరు



**తోటపల్లి గూడూరు, మే 31, ప్రభాతవార్త:** తోటపల్లి గూడూరు మండలం వరిగొండ గ్రామంలోని ఎస్‌టి కాలనీలో సోమవారం (జూన్ 1) ఉదయం 10 గంటలకు సోలార్ పరికరాలు, పెన్షన్లు, పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వరిగొండ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కోడూరు చిన్న బాబిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారని ఆయన పేర్కొన్నారు. గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోడూరు చిన్న బాబిరెడ్డి కోరారు.

## మంత్రిగారు చెప్పినా.....

**కార్యరూపం దాల్చని జెండాదిబ్బ రోడ్డు    పట్టించుకోని ఆర్అండ్బి అధికారులు**



**సంగం మే 31 ప్రభాతవార్త** సాక్షాత్తు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామా నారాయణరెడ్డి జెండాదిబ్బ గ్రామానికి రోడ్డు మంజూరు అయిందని చెప్పి రెండు నెలలు పూర్తి అయినా ఇంత వరకు కార్యరూపం దాల్చకపోవడంతో జెండాదిబ్బ గ్రామ ప్రజలు తీవ్ర అసం తృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంత్రిగారు చెప్పినా ఆర్అండ్బి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ఆ గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలోనే మంత్రికి మంచి మెజార్టీ తీసుకొని వచ్చిన గ్రామం జెండాదిబ్బ. అటువంటి గ్రామంలో ప్రధాన రోడ్లు నిర్మాణం విషయంలో ఎందుకు వెనుకబడుతోంది అర్థం కావడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. బుచ్చిరెడ్డిపాళెం నుండి జెండాదిబ్బ కు వెళ్ళాలంటే నరకం కనబడతుంది.దీంతో ప్రజలు తీవ్రశాపనార్ధాలు పెడుతున్నారు. ఆర్అండ్బి అధికారులు స్పందించి జెండా దిబ్బకు రోడ్డు వేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## కావలి డిప్యూటి డిఈఓ హరిప్రసాద్కు ఘనసత్కారం



**కావలి, మే 31 ప్రభాతవార్త :** కావలి డిఫ్యూటి డిఈఓ ఎం.హరిప్ర సాద్ ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక విట్స్ కళాశాల ఆడిటోరి యంలో ఆదివారం మెమోంటో అందజేసి శాలువాలతో,పూలమాలలతో ఘనంగా సత్కరించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మౌలిక వసతుల కల్పన జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం, ఎస్పిఎస్ఆర్ జిల్లా విద్యాశాఖా అధికారి బాలాజీరావు, ఏపీసి వెంకట సుబ్బయ్యలు విచ్చేసి హరిప్రసాద్ సేవలను కొనియాడి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి ఉపాధ్యాయుల మార్గదర్శనానికి విశేష సేవలు అందించడం జరిగిందన్నారు. పదవీ విరమణ అనంతరం వారి అనుభావాన్ని సమాజ, విద్యారంగం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని అతిధులు ఆకాంక్షించారు. నెల్లూరు డిపి డిప్యూటి డిఈఓ నాయక్, ఆత్మకూరు డిప్యూటి డిఈఓ జనాకిరామ్, కందుకూరు డిప్యూటి డిఈఓ నరసింహారావు, కావలిమండల విద్యాశాఖ అధికారులు బి.గోవిందయ్య, సిహెచ్.వెంకటసుబ్బయ్య, డివిజన్పరిధిలోని మండల విద్యాశాఖాధికారులు, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బిఎంఆర్ సేవలు స్ఫూర్తిదాయకం




**కావలి, మే 31 ప్రభాతవార్త :** రాజ్యసభ సభ్యులు బీదమస్తాన్రావు బిఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్ర మాలు అందరికి స్ఫూర్తిదాయకమని విశ్వోదయ విద్యాసంస్థల రెక్టర్ దొడ్లవినయ్ కుమార్రెడ్డి తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆదేశాల మేరకు గత 30రోజుల నుండి జవహర్ భారతి డిగ్రీ కళాశాలలోని డిఆర్ క్రీడా ప్రాంగ ణం నందు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్రెడ్డి పర్యవేక్షణలోఘనంగా నిర్వ హించడం జరిగింది. ఈ శిక్షణ శిబిరాలు అదివారంతో ముగియడం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ముగింపు కార్యక్రమానికి దొడ్ల వినయ్కుమార్రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని క్రీడాకారులకు బిఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఏర్పా టు చేసిన క్రీడా దుస్తులను పంపిణీ చేయడం జరిగింది. విశ్రాంత ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఫైర్ అధికారి శ్రీనాథ్రెడ్డి, గ్రంధి రమేష్, ఫుట్బాల్ కోచ్ నవీద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళల్లో 'అక్షర' వెలుగులు

**కలం పట్టి సంతకం చేస్తున్న వయోజనులు**



**కోట, మే 31 ప్రభాతవార్త** డ్వాక్రా మహిళల్లో వయోజన విద్య అక్షర వెలుగులు నిపుతోంది. తమ పేరు సైతం రాయలేని వారు వేలిముద్రల స్థాయి నుంచి పెన్ను పట్టుకుని ఎంచక్కా సంతకం చేయగలుగుతున్నారు. ఉల్లాస్ కార్యక్రమం ఈ మార్పునక దోహదపడింది. అక్షరాంధ్ర పేరుతో రాష్ట్ర ప్రభుత్వం దీనిని పకడ్బందీగా నిర్వహిస్తుంది. ఇటివలే శిక్షణ పూర్తి చేసుకున్న మండలంలోని 2734 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరుందరూ చదవడం, రాయడం, చేయగలుగుతున్నారని ఎపిఎం అనిల తెలిపారు.గతంలో వీరంతా సమావేశాలకు హజరై ఆర్పీలు, ఎక్కడ వేలి ముద్రలు వేయమంటే అక్కడ వేసే వారు. బ్యాంకు రుణాలు పొందాలన్నా ఆర్థిక లావాదేవీలు, పథకాల విధి విధానాలు తెలుసుకునేందుకు డ్వాక్రా ప్రతినిధులును ఆశ్రంచాల్సి వచ్చేది. ఇప్పుడు వీరందురూ అక్షర చైతన్యంతో సంతకాలు చేస్తూ అన్నింటినీ తెలుసుకుగలగుతున్నారని అనిల చెప్పారు.

## వాకాడు డిపో మేనేజర్గా షెక్.కరీమునీసా

**కోట,మే 31 ప్రభాతవార్త** వాకాడు ఆర్టీసీ డిపో మేనేజర్గా షెక్.కరీమునిసా ఆదివారం వాకాడు ఆర్టీసీ డిపోలోని డిఎంగా బాధ్యతలు స్వీకరించారు.ఇక్కడ డిపో మేనేజర్గా పనిచేస్తున్న చిన్న పెంచలయ్య పదవి విరమణ పొందారు. ఇక్కడకు డిపో మేనేజర్గా నెల్లూరు 2డిపోలో డిఎంగా పనిచేస్తున్న కరీమునిసా ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆమెకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

## నగరంలో చెలరేగిపోయిన చైన్ స్నాచర్లు

**- ఒకే రోజు మూడు చోట్ల చోరీలు**

**నెల్లూరు క్రైం, మే 31, ప్రభాతవార్త** నగరంలో శాంతిభద్రతలు ఎటు పోతున్నాయి? మహిళలకు కనీస రక్షణ ఏది? తెల్లవారుజామున రోడ్డుపైకి రావాలంటేనే నగరవాసులు వణికిపోయే పరిస్థితి దాపురించింది. కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే, వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు మహిళల మెడల్లోంచి ఏకంగా తొమ్మిది సవర్ల బంగారు గొలుసులను దుండగులు తెంపుకెళ్లడం నగరంలో తీవ్ర కలకలం రేపుతోంది. పక్కా స్కెచ్తో, బైక్లపై వస్తున్న ఈ ముఠా వరుస దోపిడీలతో పోలీసులకే సవాల్ విసురుతోంది. ఆయా ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. విజయమహల్ గేటు ప్రాంతానికి చెందిన ప్రశాంతి అనే మహిళ తెల్లవారు జామున ఇందుకూరుపేట వెళ్లేందుకు బస్సు కోసం ఆత్మకూరు బస్టాండుకు నడుచుకుంటూ బయలుదేరారు. ఆమె ఒంటరిగా వెళ్లడాన్ని గమనించిన ఇద్దరు దుండగులు బైక్పై వచ్చి, జేమ్స్ గార్డెన్ వద్ద ఆమెను అడ్డుకున్నారు. క్షణాల వ్యవధిలోనే ఆమె మెడలోని మూడున్నర సవర్ల బంగారు సరుడును బలవంతంగా తెంపుకుని పరారయ్యారు. బాధితురాలు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పడారుపల్లి ఆటోనగర్ కాలనీకి చెందిన కావేరి అనే మహిళ ఉదయం తన ఇంటి ముందు వాకిలి శుభ్రం చేసుకుంటున్నారు. అదే సమయంలో బైక్పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమెను గమనిస్తూ కొద్ది దూరంలో బైక్ను ఆపారు. అంతలోనే ఒకడు కాలినడకన ఆమె వద్దకు వచ్చి, మెడలోని మూడున్నర సవర్లబంగారు గొలుసును లాక్కొని, సిద్ధంగా ఉన్న బైక్పై ఎక్కి మెరుపు వేగంతో పారిపోయాడు. ఈ ఘటనపై బాధితురాలు వేదాయపాలెం పోలీసులను ఆశ్రయించారు.హరనాథపురంలో నివాసం ఉంటున్న సృజన అనే మహిళ ఉదయం 5:30 గంటల ప్రాంతంలో తన భర్తతో కలిసి చిల్డ్రన్స్ పార్కు సాయిబాబాగుడి సమీపంలో మార్నింగ్ వాకింగ్ చేస్తున్నారు. భర్త పక్కన ఉన్నా సరే దుండగులు ఏమాత్రం జంకలేదు. బైక్పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు సృజన మెడలోని రెండు సవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లారు. బాధితురాలు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఒకే రోజు, కొద్ది గంటల వ్యవధిలోనే మూడు వేర్వేరు పోలీస్ స్టేషన్ల పరిధిలో (నవాబుపేట, వేదాయపాలెం, బాలాజీనగర్) ఇంతటి దారుణాలు జరగడం కలకలం రేపుతోంది. నిందితులు ఒకే ముఠాకు చెందినవారా? లేక వేర్వేరు వ్యక్తులా? అసలుతెల్లవారు జామున నగరంలో పోలీసుల పెట్రోలింగ్, నిఘా వ్యవస్థ ఏమైంది? సీసీటీవీ కెమెరాల నిఘా పనిచేస్తోందా? మహిళల భద్రతకు గ్యారెంటీ ఏది? అని నగర ప్రజలు తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు. వరుస చైన్స్నాచింగ్ల సమాచారంతో పోలీసులు అప్రమ త్తమయ్యారు. ఇన్స్పెక్టర్లు వేణుగోపాల్రెడ్డి, శ్రీనివాసరావు, సాంబశి వరావులు రంగంలోకి దిగి, సాంకేతిక పరిజ్ఞానం (సీసీటీవీ ఫుటేజీలు, మొబైల్ సిగ్నల్స్) ఆధారంగా నింది తుల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. నగర ప్రజలను భయాందోళనల నుంచి గురిచేస్తున్న ఈ ముఠాను పోలీసులు ఎంత త్వరగా పట్టుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

# సైదాపురం టీడీపీలో ముదురుతున్న విబేధాలు..!

**- పార్టీ కోసం కష్టపడిన వారికి దక్కని ప్రాధాన్యత**

**- గ్రామాల్లో రెండు వర్గాలుగా చీలిన టీడీపీ..!**

**- మండల పార్టీ భవిష్యత్తుపై కార్యకర్తల్లో ఆందోళన..!**

**సైదాపురం, మే31, ప్రభాతవార్త** ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం మండలంలో తెలుగుదేశం పార్టీలో అంతర్గత విభేధాలు రోజురోజుకు ముదురుతున్నట్లు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతుంది. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పని చేసిన నాయ కులకు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత దక్కడం లేదనే ఆవేదనతో పలువురు నాయకులు అసంతృప్తితో ఉన్నారు. ముఖ్యంగా గత వైసీపీ ప్రభుత్వ పాలనలో తెలుగుదేశం పార్టీకి కష్ట కాలంలో అండగా నిలిచి పలు కేసులు పెట్టించుకున్న, సీనియర్ క్యాడర్ను పక్కన పెట్టి కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి, ప్రతిపక్షంలో తెలుగుదేశం పార్టీ ఉన్నప్పుడు తలిలాంటి పార్టీకి వెన్నుపోటు పొడిచిన వారికి ప్రాధాన్యత ఇస్తూ వారికి కీలక బాధ్యతలు ఇవ్వడంతో మండలంలోని చాలా మంది సీనియర్ నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఇద్దరు ముగ్గురు నాయకుల చేతుల్లోనే పార్టీ వ్యవహారాలు నడుస్తున్నాయని ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. కీలక నిర్ణయాలు వారి చేతిలోనే కేంద్రీకృతం కావడంతో గ్రామ స్థాయిలో ఉన్న నాయకులు, కార్యకర్తలు నిరుత్సాహానికి గురవుతున్నట్లు తెలుస్తుంది. తాము గ్రామ స్థాయిలో పార్టీకి అండగా ఉంటూ కష్టపడి తెలుగుదేశం పార్టీని గెలిపిస్తే, కనీసం గ్రామ స్థాయిలో కూడా తమ పనులు కావడం లేదని పలువురు నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా మండలంలో పెత్తనం చె లాఇస్తున్న నాయకుల వ్యవహారశైలి వల్ల అనేక గ్రామంలో పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయి, అధికార పక్షం , ప్రతిపక్షం రెండు కూడా తెలుగు దేశం పార్టీవే అని పలువిమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో పెత్తనం చేసే ఇద్దరు ముగ్గురు నాయకులు పాత టీడీపీ వర్గాన్ని చాలా వరకు పక్కన పెడుతూ , కొత్తగా పార్టీలోకి వచ్చిన వారితో పాటు వీరికి అనుకూలంగా ఉన్న మరి కొంత మందికి పనులు చేయిస్తూ, పాత వర్గాన్ని పక్కనపెట్టడంతో అనేక గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ రెండువర్గాలుగా చీలి పోయినట్లు ఆరోపణలు వినిపిస్తు న్నాయి. ముఖ్యంగా గత ప్రభుత్వంలో జరిగిన ఎం పీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీలోనే ఉంటూ అనధికారికంగా వైసీపీకి సపోర్టు చేసి పార్టీకి తీవ్ర నష్టం కలిగించిన ఓ నాయకుడుకు మండల పెత్తనం ఇవ్వడంతో అతని వ్యవహార శైలి సరిగా లేకపోవ డం,పార్టీ కోసం అనేక ఇబ్బందులు కేసులు పెట్టిం చుకుని గెలుపు కోసం కష్టపడిన వారిని పక్కన పెట్టడంతో చాలా మంది నాయకులు తీవ్ర అసంతృప్తితో ఉంటూ కార్యక్రమంలకు దూరంగా ఉంటున్నారు. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో మాజీ మండల టీడీపీ అధ్యక్షులు కట్టా మోహన్కృష్ణారెడ్డి కష్టకాలంలో ఉన్న పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ అనేక ఇబ్బందులకు గురి చేసిన పలు కేసులు పెట్టి ఇబ్బంది పెట్టిన ధైర్యంగా ఉంటూ మండలంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసి పార్టీ గెలుపుకు కృషి చేశారు. కానీ ఆయనకు పార్టీలో సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ప్రస్తుతం అతనితో పాటు ఆయన వర్గం కూడా పార్టీకి దూరంగా ఉంది. అదే విధంగా మర్లపూడి గ్రామానికి చెందిన వరద బండి వెంకటేశ్వ ర్లురెడ్డి ఆ గ్రామంలో అనేక ఇబ్బందులు పడి కార్యకర్తలకు అండగా నిలిచి అనేక కేసులు పెట్టించుకుని ఇబ్బందులు పెట్టినప్పటికీ పార్టీ కార్య కర్తలకు అండగా నిలిచారు. అలాగే చాగణంగ్రామానికి చెందిన జనార్ధన్ రెడ్డి,కందాటి దయాకర్రెడ్డి, గుళించెర్ల గ్రామానికి చెందిన నలమారు వెంకటేశ్వరరెడ్డితో పాటు మండలంలోని టీడీపీ నాయకులు ఊటుకూరు గ్రామానికి చెందిన దశ య్య నాయుడు, తురిమె ర్ల గ్రామానికి చెందిన రమణయ్య నాయుడు, తోట శ్రీనివాసులురెడ్డితో పాటు పలువురు సీనియర్ నాయకులు, కష్టకాలంలో పార్టీ కోసం కృషి చేశారు. అయితే వారికి సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో పార్టీ కార్యక్రమాలకు చాలా వరకు దూరంగా ఉంటున్నారు. ముఖ్యంగా పార్టీ గెలుపుకి కృషి చేసిన నోటి రమణారెడ్డి వర్గం కూడా పార్టీకి దూరమయ్యారు. గతంలో టీడీపీకి వెన్నుపోటు పొడిచిన కొందరు నాయకులకు ప్రస్తుతం మండల పెత్తనం ఇవ్వడంతో సీనియర్ నాయ కులు,కార్యకర్తలు తీవ్ర అసంతృప్తితో ఉంటూ పార్టీకి దూరంగా ఉన్నట్లు తెలు స్తోంది. ముఖ్యంగా మండలంలో ప్రస్తుతం గ్రామ పంచాయతీ సర్పంచ్ల పదవీ కాలం ముగియడంతో వారి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించడం జరిగింది. అయితే కొన్ని పంచాయతీల్లో మండల పెత్తనం చేస్తూ చెలా మణి అవుతున్న నాయకులకు అనుకూలంగా ఉన్న అధికారులను గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారు లుగా నియమించు కొని,అసలైనకార్యకర్తలకు,టీడీపీ సీనియర్ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వనీయ కుండా, వారి స్థానంలో పార్టీకి సంబంధం లేని కొత్త నాయకులకు కొన్ని గ్రామాల్లో పెత్తనం ఇస్తూ, ఇబ్బంది పెడుతున్న సంఘటనలు కూడా కొన్ని గ్రామాల్లో నెలకొంటున్నాయి. సంవత్సరాలు తరబడి పార్టీ కోసం శ్రమించిన వారిని పక్కన పెట్టి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయని వారి చేతుల్లోకి కీలక బాధ్యతలు ఉండటం సమంజసం కాదని టీడీపీ క్యాడర్ బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. మండలంలో జరుగుతున్న పరిస్థితులపై అనేక మార్లు ముఖ్య నాయకుల దృష్టికి తీసుకువెళ్లిన ప్రయోజనం లేదని పార్టీ సీనియర్ నాయకులు వాపోతున్నారు. అసంతృప్తిగా ఉన్న సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఇటీవల మండలంలో జరిగిన మహానాడు కార్యక్రమంలో ముఖ్య నాయకులు, సీనియర్ కార్యకర్తలు కనిపించకపోవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.



అసంతృప్తి కారణంగానే వారు దూరంగా ఉన్నారా అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. మరో వైపు మండల స్థాయిలో ఒక నాయకుడు పెత్తనం పెరగడంతో పాటు అతని వ్యవహార శైలి వల్ల పార్టీ శ్రేణులు రెండు వర్గాలుగా చీలిపోయాయి అనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారిని పక్కన పెట్ట డం, ఇటీవల చేరిన వారికి అధిక ప్రాధాన్యతతో పా టు మండల పెత్తనం నాదే అంటూ చెలామణి చేస్తున్న ఓ నాయకుడు తనకంటూ ఒక వర్గాన్ని చేసుకోవడంతో సీనియర్ క్యాడర్లో అసంతృప్తి పెరుగుతుంది. దీంతో కొందరు పార్టీకి పూర్తి దూరమయ్యే ఆలోచనలో ఉన్నారనే ప్రచారం కూడా జరుగుతుంది. మండల స్థాయిలో ఉన్న అంతర్గత విభేధాల వల్ల రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపధ్యంలో ఈపరిణామాలు టీడీపీకి ఆందోళనక లిగించే అంశంగా మారుతున్నట్లు పలు విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో నెలకొన్న విభే ధాలను అధిష్టానం వెంటనే పరిష్కరించి, అసం తృప్తితో ఉన్ననాయకులు,కార్యకర్తలను కలుపుకొని వెళ్లకపోతే వచ్చే ఎన్నికల్లో పార్టీకి గట్టిఎదురు దెబ్బతగిలే అవకాశం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

# కిమ్స్ హాస్పిటల్ వైద్యుల ఆధ్వర్యంలోపొగాకు వ్యతిరేక దినోత్సవం



**నెల్లూరు వైద్యం, మే 31, ప్రభాతవార్త** నెల్లూరు కిమ్స్ హాస్పిటల్ వైద్యుల ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక దినోత్సవంను ఆదివారం నిర్వహించారు. ప్రజల్లో అవగాహన నిమిత్తం నెల్లూరు నగర మునిసిపల్ కమీషనర్ వై.ఓ. నందన్ ఆధ్వర్యంలో విజయవంతంగా 3 కిమీ నడక కార్యక్రమంను నిర్వహించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కిమ్స్ హాస్పిటల్ వైద్య బృందం ఆదివారం ఉదయం 6:00 గంటలకు 3కే అవగాహన వాక్ను నిర్వహించారు. పొగాకుకు నో చెప్పండి, ఆరోగ్యానికి అవును చెప్పండి, పొగాకు రహిత సమాజ నిర్మాణానికి అందరం కృషి చేద్దాం అనే నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ కిమ్స్ హాస్పిటల్ వైద్య బృందం ఈ అవగాహన 3 కిమీ నడక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా నెల్లూరు నగర మున్సిపల్ కమిషనర్ వై.ఓ. నందన్ హాజరై వాక్ థాన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఉద్యోగులు 250 మంది పాల్గొని, ఈ వాక్ థాన్ కిమ్స్ హాస్పిటల్, దర్గామిట్ట నుండి ప్రారంభమై ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియం వరకు విజయవంతంగా పూర్తిచేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వై.ఓ. నందన్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ పొగాకు ఆరోగ్యానికి హానికరమని, ప్రతి ఏటా దీనివలన పెరుగుతున్న మరణాలు,ప్రజలు ఎదుర్కొనే కాన్సర్, గుండె జబ్బులు, ఇతర ప్రాణాంతకమైన వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పొగాకు రహిత సమాజాన్ని నిర్మించాలని ప్రజలను కోరారు. అనంతరం కిమ్స్ వైద్యులు హెచ్.ఓ.డి. కార్డియాలజీ డాక్టర్ సి.ఎస్. శ్రీనివాస రాజు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. సతీష్ కుమార్, పల్మనాలజిస్ట్ డాక్టర్ సి. శశిభరత్ కుమార్ రెడ్డి, ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ అవినాష్ రావులు మాట్లాడుతూ పొగాకు వినియోగం వల్ల క్యాన్సర్, గుండె జబ్బులు, శ్వాసకోశ వ్యాధులు, ఇతర ప్రాణాంతక ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం అధికమని తెలిపారు. యువత, ప్రజలు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, సమాజంలో బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. సమాజంలో పొగాకు వినియోగాన్ని తగ్గించడం, ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడం కోసం కిమ్స్ హాస్పిటల్ నిరంతరం వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని హాస్పిటల్ మేనేజ్మెంట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వైద్యులు అధికారులు డాక్టర్ సి.శశిభరత్ కుమార్రెడ్డి (పల్మనాలజిస్ట్), డాక్టర్ అవినాష్ రావు (ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్), డాక్టర్ ఎన్.జానకిరామ్ (సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్), డాక్టర్ బి. ప్రసాద్ (పాథాలజిస్ట్), డాక్టర్ రోహిణి ప్రియ లక్ష్మి (యూనిట్ హెడ్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్), డాక్టర్ ఎస్. సతీష్ కుమార్ (మెడికల్ డైరెక్టర్) ప్రజలకు అవగాహన కల్పించుటకై నిర్వహించిన ఈ వాక్ను విజయవంతం చేసిన కిమ్స్ హాస్పిటల్ డాక్టర్లకు, సిబ్బందికి, నర్సింగ్ కాలేజీ విద్యార్థులకు హాస్పిటల్ మేనేజ్మెంట్ ధన్యవాదాలు తెలియజేశారు.




**ప్రత్యేక హెల్త్ స్క్రీనింగ్ ప్యాకేజీ ప్రకటన..** ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా కిమ్స్ హాస్పిటల్స్ ప్రత్యేక హెల్త్ స్క్రీనింగ్ ప్యాకేజీను అందుబాటులోకి తీసుకొచ్చిందని కిమ్స్ వైద్యులు తెలిపారు. అందులో సాధారణ ధర 2,220 రూపాయలు అని, ప్రత్యేక రాయితీ ధర 888 రూపాయలు మాత్రమే పేర్కొన్నారు. ఈ ప్యాకేజీలో ఛాతీ ఎక్స్ రే, సీబీపీ, ఏఈసీ, పల్మనరీ ఫంక్షన్ టెస్ట్ వంటి పరీక్షలు వున్నాయన్నారు. అయితే ఈ ప్రత్యేక ఆఫర్ జూలై 31, 2026 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. ధూమపానం చేసే వారు ఊపిరితిత్తుల ఆరోగ్యంపై అవగాహన కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వైద్యులు కోరారు.

## నిజాయితీ, నిబద్ధతో పనిచేశారు

**- ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించారు**



**గూడూరు రూరల్, మే 31, ప్రభాతవార్త** నిజాయితీగా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది రాకుండా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు విధి నిర్వహణను విజయవంతంగా నిర్వహించారని మంచి కమిషనర్ రిటైర్మెంట్ అవుతున్నందుకు చాలా బాధగా ఉందని ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కోరారు. గూడూరు పట్టణంలోని పోటుపాలెం రోడ్డు లోని దివ్య ఫంక్షన్ హాల్లో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పదవీ విరమణ సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వర్లు దంపతులను ఎమ్మెల్యే సునీల్ కుమార్ దంపతులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే పలువురు టిడిపి నాయకులు మాజీ కౌన్సిలర్లు పలు రాజకీయ పార్టీ వారు పురపాలక సంఘ సిబ్బంది ప్రజలు కమిషనర్ని సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్గా వెంకటేశ్వర్లు నిజాయితీగా విశేష సేవలు అందించారని ప్రజలు ఏ సమయంలో ఫోన్ చేసి సమస్య తెలియజేసిన వెంటనే దాన్ని పరిష్కరించే వారిని తెలిపారు పట్టణంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు కమిషనర్ మరియు టిడిపి సీనియర్ నాయకులు కిరణ్ కుమార్ ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. కమిషనర్ రిటైర్మెంట్ అయినా ఆయన సలహాలు సూచనలు అందించి గూడూరు పట్టణాభివృద్ధికి సహకరిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తానంకి నానాజీ, కిరణ్ కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, రహీం, మస్తాన్ నాయుడు, శివకుమార్, చంద్రమౌళి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్డేకు మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి



**కోవూరు, మే31ప్రభాతవార్త** :తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కారం కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికా రులు తప్పనిసరిగా హాజరు కావాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య తెలిపారు. కేవలం కొన్ని శాఖల అధికారులు మాత్రమే హాజరవుతు న్నారని, దీనిని దృష్టి లో పెట్టుకుని ప్రతి సోమవారం ఉదయం 10 గంటలకు జరిగేఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులంతా తప్పనిసరిగా ఉండాల న్నారు.

## కొనలేం .. తినలేం

**పెరగిన కూరగాయలు, కోడిగుడ్ల ధరలు**





**కోవూరు మే 31 ప్రభాతవార్త** గ్రామీణ ప్రాంతాల్లో కూరగాయలు, కోడిగుడ్ల ధరలకు రెక్కలు రావడంతో సామాన్యుని పరిస్థితి అగమ్య గోచరంగా మా రింది. గతంలో ఎన్నడూ లేని విధంగా గత నెలరోజులుగా కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటడంతో వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలం వరకు కిలో 10 నుంచి 30 రూపాయలు లోపు ఉన్న పచ్చిమిర్చి ధర ఒక్కసారిగా 60 రూపాయలుకు చేరుకోవడంతో పచ్చడి చేసుకుం దామన్న కన్నీళ్లు తెప్పిస్తున్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు టమో టాలు, వంకాయలు, క్యారెట్, బీన్స్, పెద్ద చిక్కుడులు, తదితరవి విపతీరంగా పెరిగిపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయలతో పాటు చికెన్, మటన్, కోడిగుడ్ల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్య కుటుంబాల పరిస్థితి కూర చేసుకోవాలన్న ధరలు పెరగడం .. దీంతో పాటు కోడిగ్డుడ్లు కూడా ఒ కొక్కటి 5 నుంచి 7.00 రూపాయలకు చేరుకోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కిలోల చొప్పున కూరగాయలు కొనే వారి పరిస్థితి పావుకిలోకు దిగజారింది. అధికారులు స్పందించి కూరగాయల ధరలకు నియంత్రణ తేవాలని ప్రజలు కోరుతున్నారు.

## వాతావరణ పరిస్థితుల దృష్ట్యా విద్యుత్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలి

**- విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘువేంద్రం**



**నెల్లూరు వైద్యం, మే 31, ప్రభాతవార్త** జిల్లాలో మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రానున్న రోజులలో ఈదురుగాలులు, భారీవర్షాలు సం భవించే అవకాశం ఉన్నందున అన్ని డివిజన్లు, సబ్డివిజన్లు, సెక్షన్లలో పనిచే స్తున్న అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘవేంద్రం ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ అంతరాయాలు ఎక్కడైనా సంభవించిన వెంటనే ఉర్జా మిత్రలో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. సంబంధిత వినియోగదారులకు అంతరాయం వివరాలను వెంటనే తెలియజేయాలి. అవసరమైన చోట ఎస్పిడిసిఎల్ యాప్లో కూడా సమాచారం అప్డేట్ చేయాలన్నారు. ఉర్జా మిత్ర, ఇతర వ్యవస్థలలో సమాచారం నమోదు చేశారా లేదా అనే విషయాన్ని కార్పొరేట్ ఆఫీస్ నిరంతరం పర్యవేక్షిస్తుంటుందన్నారు. అందువల్ల ఎటువంటి నిర్లక్ష్యం చేయరాదన్నారు. ప్రతి డివిజన్, సబ్ డివిజన్ పరిధిలో ఫ్యూస్ ఆఫ్ కాల్ టీమ్స్ను ఏర్పాటు చేసి 24 గంటల పాటు సిద్ధంగా ఉంచాలని, ఎక్కడైనా చెట్లు పడిపోవడం, విద్యుత్ లైన్లు దెబ్బతినడం లేదా ఇతర అంతరాయాలు సంభవించినట్లయితే వెంటనే ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా మరియు సోషల్ మీడియా ప్రతినిధులకు సమాచారం అందిం చాలన్నారు. రానున్న 15 రోజుల పాటు ఇలాంటి వాతావరణ పరిస్థితులు కొనసాగవచ్చునని అం చనా ఉన్నందున ప్రతి ఒక్క అధికారి, ఉద్యోగి పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలన్నారు. ప్రతి బ్రేక్ డౌన్ జరిగిన వెంటనే సంబంధిత వివరాలను తెలియజేయడమే కాకుండా, రెక్టిఫికేషన్ పూర్తైన వెంటనే పున రుద్ధరణ సమాచారాన్ని కూడా తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, అన్ని అధికారులు సిబ్బంది విజిలెంట్గా ఉండి, ఎటువంటి అత్యవసర పరిస్థితినైనా వేగంగా స్పందించాలన్నారు. అన్ని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ తమ పరిధిలోని విద్యుత్ అంతరాయాలు, బ్రేక్డౌన్లు, పునరుద్ధరణ చర్యల వివరాలను గ్రూప్లో తప్పనిసరిగా తెలియజేయా లన్నారు. ఎటువంటి అలసత్వం, నిర్లక్ష్యంలేదా సమాచార లోపం జరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.